వాయిస్ ఆఫ్
వందే భారతి
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
TGTEL/25/A4812

సంపుటి : 01| సంచిక : 93 | పేజీలు : 05| వెల: రూ.3/- | తెలంగాణ | శనివారం | అక్టోబర్ 31, 2026



2లో..

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- జాతీయ జనగణనలో బీసీ కులగణన చేర్చాలి

పంటలు వేయవద్దన్నసీఎం అధికారంలో ఉండొద్దు

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
ఇంద్రవెల్లిలో 'పాంచజన్య సంకల్ప సభ'
కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు



2లో..

ఈ ముఖ్యమంత్రికి ఎంత చెప్పినా అర్థం కావడం లేదు, చలనం లేదు

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- నాగారంలో నాలుగో రోజుకు చేరిన పాదయాత్ర
- మద్దతు తెలిపిన గరికపాటి మోహన్ రావు, చీకోటి ప్రవీణ్, కీర్తిరెడ్డి


2లో..

వేములవాడ మున్సిపల్ సమావేశంలో రసాభాస

- ఆక్రమణలు తొలగించాలని బీజేపీ, బీఆర్ఎస్ డిమాండ్
- ఎజెండా అంశం తొలగింపుపై కౌన్సిలర్ల తీవ్ర అభ్యంతరం
- ఆమరణ నిరాహార దీక్షకు హెచ్చరిక


4లో..

పార్టీలకు అతీతంగా సమగ్ర అభివృద్ధి


5లో..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి
- మేడిగడ్డ నీళ్లను వాడుకోకుండా రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల ఘాటు విమర్శలు



4లో..

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శనివారం, అక్టోబర్ 31, 2026

ఎమ్మెల్సీ అభ్యర్థిగా జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటన
- రెండో స్థానంలోనూ బీసీ అభ్యర్థికే పిలుపు
- ఎన్నికల ఇంచార్జీల నియామకం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రెండు దశాబ్దాల అనుభవం ఉన్న సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఎమ్మెల్సీ స్థానానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను ఖరారు చేయగా, రెండో స్థానంలోనూ బీసీ వర్గానికి చెందిన ఆకాశ్ కొల్లూరుకే అవకాశం కల్పించి సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఎన్నికలకు సంబంధించి పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తూ కీలక బాధ్యతలను కవిత అప్పగించారు. హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానానికి అబ్జర్వర్, కో–ఆర్డినేటర్ గా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చిట్నేని రఘు నియమితులయ్యారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వ్యూహకర్తగా ప్రముఖ న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమించారు.ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్ ఛార్జీలుగా హైదరాబాద్: సురభి, మతీన్, బండారి మహేందర్ ముదిరాజ్, రంగారెడ్డి: అర్చనా సేనాపతి, మహబూబ్ నగర్: రంజిత్ గొంగళ్ల, నల్గొండ: సుజిత్, ఖమ్మం: గట్టు కరుణ, వరంగల్: మాడుగుల రాజిరెడ్డిలు నిమమితులయ్యారు. హైదరాబాద్ వాసి అయిన ఆకాశ్ కొల్లూరు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీనియర్ జర్నలిస్ట్. ఇండియా టుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డెయిలీ హంట్ వంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థల్లో సుమారు 20 ఏళ్ల పాటు జర్నలిస్టుగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బంగారు పతకం సాధించారు. విద్యాధికుడు, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఆకాశ్ కొల్లూరును గెలిపించాలని పార్టీ శ్రేణులకు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

పంటలు వేయవద్దన్నసీఎం అధికారంలో ఉండొద్దు

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఇంద్రవెల్లిలో 'పాంచజన్య సంకల్ప సభ'
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు





ఇంద్రవెల్లి (ఆదిలాబాద్), వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాష్ట్రంలో వ్యవసాయం తప్ప మరే పనితెలియని రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవిలో ఉండే అర్హత కోల్పోయారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి పుణ్యభూమిలో శుక్రవారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ వీరులు రామ్ జీ గొండు, కొమురం భీమ్, వన్నెల ఎల్లన్నలకు నివాళులర్పించిన అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కవిత కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తీరుపై నిప్పులు చెరిగారు. కరువు వస్తుందని తెలిసి ముందస్తు చర్యలు తీసుకోకుండా, ఇళ్లు కాలినాక బావి తవ్వినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

• ఆదిలాబాద్ గర్జన కాదు.. తర్జన భర్జన:

"సిద్దిపేట బాబు, సిరిసిల్ల బాబు"ల మధ్య ఉన్న వర్గపోరుతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగమవుతున్నారని ఎద్దేవా చేశారు. చనఖా–కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు ఎందుకు పెంచారని, ఈ అవినీతి సొమ్ము మాజీ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్నల ఇళ్లకు పోయిందా లేక బీఆర్ఎస్ ఖాతాలోకి చేరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో ఆదిలాబాద్‌కు విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కాలేజీ, లేదా టెక్స్‌టైల్ పార్క్ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌లు సీఎం రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వకుండా కాపాడుతున్నారని విమర్శించారు. మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు.

• 'పాంచజన్యం' ద్వారా ప్రజా సంక్షేమం - కవిత భరోసా:

ప్రైవేట్ రంగానికి దీటుగా ఉచిత విద్య, మెరుగైన వైద్య సౌకర్యాలను తమ పార్టీ అధికారంలోకి వస్తే అందిస్తుందని హామీ ఇచ్చారు. యువత స్వయం ఉపాధి, వ్యాపారాల కోసం రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ప్రకటించారు. మాటల్లో కాకుండా చేతల్లో సామాజిక న్యాయం చూపిస్తున్నామని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని బీసీ యువకులు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్‌లను రెండు MLC స్థానాలకు అభ్యర్థులుగా ప్రకటించామని తెలిపారు. ఐటీడీఏలో జీవో 57తో సహా 27 జీవోలను తిరిగి అమలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు, ఆదివాసీలు తమ కొత్త రాజకీయ శక్తికి ఆశీస్సులు అందించి రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

ఈ ముఖ్యమంత్రికి ఎంత చెప్పినా
అర్థం కావడం లేదు, చలనం లేదు

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- నాగారంలో నాలుగో రోజు పాదయాత్ర
- మద్దతు తెలిపిన గరికపాటి మోహన్ రావు, చీకోటి ప్రవీణ్, కీర్తిరెడ్డి



నాగారం, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రజాసమస్యల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంత చెప్పినా అర్థం కావడం లేదని, ఆయనలో ఎలాంటి చలనం లేదని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జవహర్‌నగర్/దమ్మాయిగూడ డంపింగ్ యార్డ్ ఎత్తివేతను డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. భవానీ నగర్, నాగారం పరిధిలో వంశరాజు మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాత్రకు బీజేపీ సీనియర్ నాయకులు గరికపాటి మోహన్ రావు, చీకోటి ప్రవీణ్ కుమార్, కీర్తిరెడ్డిలు హాజరై పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజలు గెలిపించి పంపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని తీవ్రంగా మోసం చేశారని విమర్శించారు. నిచ్చెన మెట్లలా వాడుకుని సీఎం అయ్యాక సమస్యలపై సమాధానం చెప్పకుండా ఇతర నాయకులతో మాట్లాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నతల్లిలాంటి చెరువు కాలకూట విషంగా మారిందని, డంపింగ్ యార్డ్ వాసన తట్టుకోలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాత్ర జరుగుతుండటంతో గత మూడు రోజులుగా రాంకీ సంస్థ సువాసన వెదజల్లే స్ప్రేలు కొడుతోందని విమర్శించారు. తాత్కాలిక నాటకాలు మాని డంప్ ఎత్తివేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. చెత్త లారీల చక్రాల కింద పడి మరణించిన యువకుల భార్యల పుస్తెల తాళ్ల సాక్షిగా ఈ ప్రభుత్వ దుర్మార్గానికి అంతం పలుకుతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి నిజాయితీ ఉంటే వెంటనే డిపిఆర్ తయారు చేసి ఇవ్వాలని, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి నిధులు తీసుకువచ్చే బాధ్యత బీజేపీ ఎంపీలందరం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు మాట్లాడుతూ ఈటల రాజేందర్ నాయకత్వంలో పోరాటంతో ఈ డంపింగ్ యార్డ్ కాలుష్యం నుంచి విముక్తి లభిస్తుందనే నమ్మకం ప్రజల్లో బలపడిందన్నారు. నాయకురాలు కీర్తిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ దుర్వాసన మధ్య ప్రజలు ఎలా బతుకుతున్నారో నేరుగా వస్తేనే తెలుస్తుందన్నారు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని, ప్రధాని మోదీ సహకారంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, డంపింగ్ యార్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- జాతీయ జనగణనలో బీసీ కులగణన చేర్చాలి

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ సుదీర్ఘ న్యాయపోరాటం ఫలించి వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా దక్కడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, న్యాయ వ్యవస్థకు ప్రజల పక్షాన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన ప్రదర్శనకు తెలంగాణ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా ముఖ్య నేతలందరూ ఢిల్లీకి తరలివెళ్లినట్లు వెల్లడించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటును, అమరవీరుల త్యాగాలను అవమానించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్ అల్లర్లు, చైనా సరిహద్దు సమస్యలను విడిచిపెట్టి ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం అమిత్ షా పర్యటిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అమిత్ షాకు అధికారిక లేఖ రాస్తున్నట్లు పొన్నం తెలిపారు. పశువులు, గొర్రెల లెక్కలు తీస్తున్న కేంద్రం, కోట్లాది మంది ఓబీసీల లెక్కలు ఎందుకు తీయడం లేదని నిలదీశారు. బీజేపీ బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, అరవింద్‌లకు చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన చేర్చేలా అమిత్ షాపై ఒత్తిడి తేవాలని సవాల్ విసిరారు. బీజేపీ పాలనలో రాజ్యాంగబద్ధమైన సంస్థలను నిర్వీర్యం చేస్తూ, పేదల ఓట్లను కుట్రపూరితంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాథమిక ఓటు హక్కును హరించే ప్రయత్నాలను సహించేది లేదని, రాబోయే రోజుల్లో ప్రజలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

శనివారం, అక్టోబర్ 31, 2026

యువ కెరటం 'విష్ణుదాసు వంశీ'



నాయకత్వ లక్షణాలు కేవలం మాటల్లో కాదు, నిరంతర ప్రజాసేవలోనే ప్రతిబింబిస్తాయని నిరూపిస్తున్నారు యువ నాయకుడు విష్ణుదాసు వంశీ. రాజకీయాన్ని ఒక బాధ్యతగా, సేవను ఒక జీవన మార్గంగా మలచుకున్న ఆయన, నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పినాకిని మీడియా ద్వారా 'యూత్ ఐకాన్' అవార్డును అందుకోవడంతో ఆయన ఖాతాలో మరొక అరుదైన గౌరవం చేరింది.

- విద్యార్థి దశ నుంచే క్రియాశీలక రాజకీయం
- వారసత్వ రాజకీయాల నుంచి ప్రజాసేవా ప్రస్థానం
- సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు
- పినాకిని మీడియా నుంచి 'యూత్ ఐకాన్' అవార్డు

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్-



తండ్రి ఆశయాలే బాటగా..

విష్ణుదాసు వంశీ రాజకీయం వారసత్వంతో ప్రారంభమైనప్పటికీ, తన సొంత సేవాతత్వంతోనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆదర్శనీయుడు, ప్రజల మనిషిగా పేరుగాంచిన తన తండ్రి కీ.శే. విష్ణుదాసు రంగారావు ఆశయాలను, ఆశయాల వారసత్వాన్ని భుజాన వేసుకుని ఆయన ప్రజాసేవలోకి అడుగుపెట్టారు. తండ్రి చూపించిన ధర్మం, ప్రజా సంక్షేమ బాటలోనే పయనిస్తూ అహర్నిశలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నమ్మకమైన నాయకుడిగా ఎదుగుతున్నారు.



విద్యార్థి దశ నుంచే క్రియాశీలకం

ఒకవైపు వ్యాపార రంగంలో తనకంటూ ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటూనే, మరొకవైపు విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను గుర్తించారు. ఎన్ ఎస్ యూఐలో క్రియాశీలక కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి, తదనంతరం యువజన కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఎదిగారు. హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ యువతలో నూతన ఉత్సాహాన్ని నింపారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు.





• సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు

రాజకీయాలకే పరిమితం కాకుండా సామాజిక రంగానికి వంశీ విశేష సేవలందిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. టీబీఎస్ఎస్ బ్రాహ్మణ సంఘాల ద్వారా బ్రాహ్మణుల ఐక్యతకు, వారి సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం, ఆలయాల ప్రాచీనతను కాపాడుతూ అభివృద్ధికి సహకరించడం, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలవడం ఆయన ప్రత్యేకత. మాటల కంటే చేతలకే ప్రాధాన్యమిచ్చే విష్ణుదాసు వంశీ, పెద్దల పట్ల గౌరవం, యువతకు మార్గనిర్దేశం చేస్తూ నిజమైన 'యూత్ ఐకాన్'గా నిలుస్తున్నారు.







4

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

శనివారం, అక్టోబర్ 31, 2026

అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాబోయే మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ఓటరు నమోదు ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆనంద్ నగర్ కాలనీ వయోపౌరుల సంఘం ప్రతినిధులను ఆయన శుక్రవారం కలసి, అర్హులైన పట్టభద్రుల కోసం ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ.. సమాజానికి వయోపౌరులు ఎంతో విలువైన మార్గదర్శకులని, వారి అనుభవం, సూచనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పట్టభద్రుల హక్కుల పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకునేలా సీనియర్ సిటిజన్లు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వయోపౌరుల సంఘం సెక్రటరీ ప్రభాకరం, నాయకులు రామ ప్రభాకర్ రెడ్డి, విష్ణు, బిట్ల శ్రీనివాస్ రాజు, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి 'పాంచజన్య సంకల్ప సభ'కు టీఆర్ఎస్ శ్రేణులు



కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'కు కోరుట్ల నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు దండుగా తరలివెళ్లాయి. సీనియర్ నాయకులు, పార్టీ హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్ డాక్టర్ చిట్నేని రఘు ఆధ్వర్యంలో శుక్రవారం కోరుట్ల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ కాన్వాయ్‌తో ఇంద్రవెల్లికి బయలుదేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు తెలంగాణ రక్షణ సేన జెండా ఊపి వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, రైతాంగ హక్కులు, ప్రజా సమస్యల పరిరక్షణే లక్ష్యంగా ఇంద్రవెల్లి పుణ్యభూమి నుంచి తమ పార్టీ శంఖారావం పూరిస్తోందన్నారు. పార్టీ పిలుపుమేరకు తరలివెళ్తున్న నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాస్యం వినయ్ భాస్కర్ గారి ఆదేశాల మేరకు 5వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్రోల్మెంట్ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజన్ ఇన్చార్జి కుసుమ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సుభాష్ నగర్, రెడ్డి కాలనీ, కొత్తూరు జెండా ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికీ తిరిగి అర్హులైన పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు నమోదు ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూర్తి చేసిన ఫారాలను సేకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పండగ సాగర్, దాసరి సమ్మన్న, కానుగంటి అరవింద్, నారాయణ, గిరిరాజు, తాడిశెట్టి మహేష్, కుతాడి ప్రభాకర్, సోషల్ మీడియా ప్రతినిధులు విశాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి**
- **మేడిగడ్డ నీళ్లను వాడుకోకుండా రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం**
- **తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల ఘాటు విమర్శలు**



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాష్ట్రంలో నెలకొన్న సాగునీరు, తాగునీటి ఎద్దడి కాకతాళీయంగా వచ్చింది కాదని, అది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 'కాంగ్రెస్ నిన్నో' కరువని కొరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కె.సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్ కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్, చిరుమళ్ల రాకేష్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వంలో గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా మేడిగడ్డ వెళ్లామని, ఇప్పటికీ అక్కడ 25 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నా రేవంత్ రెడ్డి సర్కార్ నీటిని ఎత్తిపోసే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. వెయ్యి టీఎంసీల నీటిని గోదావరిలో వదిలేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులను క్రాప్ హాలిడే ప్రకటించమనడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో లేని కరువు కాంగ్రెస్ దిగిపోగానే ఎందుకు వచ్చిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నీళ్లు లేవు కానీ గ్లోబల్ సమ్మిట్లా?:

గొంతు తడిపేందుకు మంచినీళ్లు ఇవ్వలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్లు పెడతామని అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గ్లోబల్ సమ్మిట్ కాకుండా 'నీళ్ల సమ్మిట్' పెడితే నీళ్లు ఎలా ఎత్తిపోయాలో తాము చెప్తామని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో కరెంట్ ఉత్పత్తిని 20 వేల మెగావాట్లకు పెంచితే, ఈ ప్రభుత్వం పరిశ్రమలకు సరిగా విద్యుత్ ఇవ్వలేకపోతోందన్నారు. క్రైటెక్స్ వంటి పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో ఒక్క ఫ్లైఓవర్ కట్టలేదని, కేసీఆర్ పాలనలో 30 ఫ్లైఓవర్లు నిర్మించామని గుర్తుచేశారు. ప్రజలకు, రైతులకు నీళ్లు ఇవ్వని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే త్వరలోనే హాలిడే ఇచ్చి ఇంటికి పంపుతారని జోస్యం చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నందనం గ్రామీణ స్మార్ట్ విలేజ్ సెంటర్ సందర్శన

- **పరిశీలించిన తెలంగాణ పీఏసీఎస్, డీసీసీబీ ప్రతినిధులు**



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హనుమకొండ జిల్లా నందనం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) పరిధిలో నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన 'రూట్యాగ్ గ్రామీణ స్మార్ట్ విలేజ్ సెంటర్'ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల (డీసీసీబీ) ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్టడీ టూర్‌లో 18 పీఏసీఎస్‌లు, 9 డీసీసీబీలకు చెందిన మొత్తం 30 మంది ప్రతినిధులు, కో-ఆప్ ఇంటర్న్‌లు పాల్గొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో భాగంగా నాబార్డ్, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం సంయుక్త సహకారంతో నెలకొల్పిన ఈ కేంద్రంలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలించారు. కిసాన్ డ్రోన్లు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ యూనిట్, భూసార పరీక్షా కేంద్రం, స్మార్ట్ ఇరిగేషన్ సాధనాలు, సబ్జెక్ట్ కూలర్ మరియు మరమరాల తయారీ యంత్రం. ఈ పరికరాల పనితీరు, వ్యవసాయంలో వాటి వినియోగం, రైతులకు లభించే ప్రయోజనాలు, సహకార సంఘాల ఆదాయ పెంపు మార్గాలపై అవగాహన కల్పించారు. జూలై 2026లో ప్రారంభమైన నాటి నుంచి కిసాన్ డ్రోన్ సేవలు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ యూనిట్, ఆయిల్ కేక్ విక్రయాల ద్వారా ఈ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఇప్పటివరకు రూ. 2.50 లక్షల ఆదాయాన్ని ఆర్జించడం విశేషం. ఈ సందర్భంగా నందనం సెంటర్ సాధించిన పురోగతిని, నాబార్డ్ వినూత్న ఆలోచనలను సందర్శక బృందం విశేషంగా అభినందించింది. గ్రామీణ ప్రాంతాలకు ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేస్తూ, సహకార సంఘాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఇటువంటి సాంకేతిక కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఇతర సహకార సంఘాల్లోనూ వీటిని అమలు చేయాలని సూచించారు.

వేములవాడ మున్సిపల్ సమావేశంలో రసాభాస

- **ఆక్రమణలు తొలగించాలని బీజేపీ, బీఆర్ఎస్ డిమాండ్**
- **ఎజెండా అంశం తొలగింపుపై కౌన్సిలర్ల తీవ్ర అభ్యంతరం**
- **ఆమరణ నిరాహార దీక్షకు హెచ్చరిక**



వేములవాడ , వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం తీవ్ర ఉద్రిక్తత, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసనల నడుమ రసాభాసగా మారింది. కౌన్సిల్ సమావేశ ఎజెండాలో పొందుపరిచిన 18వ అంశాన్ని అధికారులు ఏకపక్షంగా తొలగించడంపై ఇరు పార్టీల కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ ముత్యం పైల్, బీఆర్ఎస్ కౌన్సిలర్ (మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్) రామతీర్థపు మాధవితో పాటు ఇతర సభ్యులు మాట్లాడుతూ.. రాజన్న దేవాలయ అధికారులు మున్సిపల్ రోడ్లను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని, మున్సిపాలిటీకి రావాల్సిన రూ. 2 కోట్ల ఆదాయాన్ని సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. కౌన్సిలర్ల నిరసనపై మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పందిస్తూ.. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. అన్ని అంశాలపై సభలో చర్చించి, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ ఆదాయ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

5

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

శనివారం, అక్టోబర్ 31, 2026

రాజన్న జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో రన్నరప్‌గా సిరిసిల్ల పోలీస్ జట్టు

■ విజేతలను అభినందించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాజన్న జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ క్రికెట్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటింది. ఆర్ఐ ఆధ్వర్యంలో బరిలోకి దిగిన సిరిసిల్ల జట్టు హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరు కనబరిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన పోలీస్ జట్టు సభ్యులను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, సమిష్టి కృషి, జట్టు స్ఫూర్తి పెరుగుతాయని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మరింత ప్రతిభ చూపి, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, సురేష్, రమేష్, ఆర్ఎస్ఐలు దిలీప్, శ్రీనివాస్, సిరిసిల్ల పోలీస్ క్రికెట్ జట్టు సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.3.94 కోట్లు

◆ మంజూరు చేసిన విప్ ఆది శ్రీనివాస్

◆ పాలకవర్గ సభ్యుల ఘన సన్మానం

వేములవాడ , వాయిస్ ఆఫ్ వందే భారత్ : వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ. 3.94 కోట్ల నిధులను మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ను మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ల ఆధునీకరణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మంజూరైన రూ. 3.94 కోట్ల నిధులతో మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మ్యాచింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, ప్రహరీ గోడలు మరియు ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కర్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. తనపై ప్రత్యేక అభిమానంతో సన్మానించిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలో కుల వృత్తులకు ప్రోత్సాహం..

పరకాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ : : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహిస్తూ, చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. పరకాల మండలం నాగారం గ్రామంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం లిమిటెడ్ కార్యాలయంలో, సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కార్పెట్ ఉత్పత్తులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని కొనియాడారు. కార్మికుల శ్రమ, నైపుణ్యంతో తయారయ్యే ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన ఎన్నికలు నిర్వహించిందని తెలిపారు. సహకార వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, సంఘాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. చేనేత కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి, నూతన మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం అద్భుతం

◆ లబ్ధిదారునికి కలెక్టర్ ప్రశంసలు

◆ గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం

◆ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో ముదిగొండ ధనలక్ష్మి అనే లబ్ధిదారు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. ఇంటి నిర్మాణ శైలి, ఇంకుడు గుంత, టాయిలెట్ల ఏర్పాటును పరిశీలించి లబ్ధిదారు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో గుడిసెల్లో నివసించే పేదలకే ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మిగతా లబ్ధిదారులు కూడా ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గృహప్రవేశాలు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాధిక, తహశీల్దార్ సురేష్ కుమార్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సమగ్ర అభివృద్ధి

• ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

• రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

• త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రజాపాలనలో భాగంగా పార్టీలు, రాజకీయాలకు అతీతంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. 11వ డివిజన్ పరిధిలోని పోతననగర్‌లో రూ. 1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రహదారులు, సైడ్ డ్రైనేజీ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా పోతననగర్ ప్రజలను వేధిస్తున్న రహదారుల సమస్యకు సిమెంట్ రోడ్ల నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు పాడవకుండా నాణ్యమైన సీసీ రోడ్లు, మురుగునీరు రోడ్లపైకి రాకుండా గ్రిల్స్‌తో కూడిన సైడ్ డ్రైనేజీలను సమన్వయంతో నిర్మిస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని 26 డివిజన్లలో ఎలాంటి రాజకీయ భేదాభిప్రాయాలు లేకుండా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఒక్కో డివిజన్‌కు రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పనుల నిర్వహణ సమయంలో రోడ్ల తవ్వకాల వల్ల కలిగే తాత్కాలిక ఇబ్బందులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కుడా భూముల వ్యవహారంలో జరిగిన అవినీతి ఆరోపణలపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని, కొనుగోలుదారులు ముందుకు రాని పక్షంలో ఆ భూములను ఐటీ టవర్ల ఏర్పాటుకు వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. వరంగల్ జిల్లా పారిశ్రామిక, ఐటీ రంగాలు, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కుడా చైర్మన్ సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు, రూ. 500కే గ్యాస్), గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత పింఛన్లు, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ భరోసాలను ప్రభుత్వం ప్రజలకు పక్కాగా అందిస్తోందన్నారు. ప్రతిరోజూ రెండు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ, క్షేత్రస్థాయిలో పురోగతిని పర్యవేక్షిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ విమర్శలు మానుకుని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మ, డివిజన్ ఇంచార్జ్ బోడ డిన్న, మాజీ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, డివిజన్ అధ్యక్షుడు సమద్, మాజీ అధ్యక్షులు సంగీత్, గోల్కొండ సాంబయ్య, బొమ్మ సురేష్, పూర్ణ, క్రాంతి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

అవసరార్థుల దగ్గరకు మనమే వెళ్లాలి

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : "సేవ చేయాలంటే ఏసీ హాల్స్‌లో కూర్చుని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే సరిపోదు.. అవసరార్థుల దగ్గరకు మనమే వెళ్లి, వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలి" అని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. శుక్రవారం హన్మకొండలోని వాజ్‌పేయీ కాలనీ, అంబేద్కర్ నగర్ స్లమ్ ఏరియాతో పాటు పలు గుడిసెల ప్రాంతాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారా? ఎవరైనా డ్రాపౌట్స్ ఉన్నారా? అలాగే 18 సంవత్సరాల లోపు పిల్లలకు బాల్యవివాహాలు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. చదువుకోకపోవడం వల్ల కలిగే నష్టాలు, బాల్యవివాహాల దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఒంటరి మహిళా పథకాలు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ల లబ్ధిని ఎలా పొందాలి, ఎవరిని కలవాలనే విషయాలను వారికి వివరంగా తెలియజేశారు. "ప్రభుత్వ పథకాలు, చట్టాల ఫలాలు పేదలకు అందాలంటే, మనం వారి శ్రేయస్సు కోరుకుంటున్నామనే నమ్మకం కలిగేలా మన ప్రవర్తన ఉండాలి. అప్పుడే లబ్ధిదారులకు సరైన న్యాయం జరుగుతుంది" అని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే శరీరాన్ని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, రాఘవ, స్థానిక గుడిసెల వాసులు పాల్గొన్నారు.